## పోలింగ్ కేంద్రాల వద్ద అసౌకర్యాలు లేకుండా చూడాలి

మంగపేట, అక్టోబర్ 27 : మండలంలోని 25 పంచాయతీల పరిధిలోని 46 పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూడాలని ములుగు అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు. మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలను ఆయన శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్, టాయిలెట్ల సమస్యలు లేకుండా చూడాలన్నారు. సౌకర్యాలు లేని పోలింగ్ కేంద్రాల వద్ద తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు పడకుండా అవసరమైన ర్యాంపులు, సదుపాయాలను ఉండేలా చూడాలని కోరారు. పోలింగ్ కేంద్రాల సందర్శనలో తహసీల్దార్ వీరస్వామి, ఎంపీడీవో శ్రీధర్ పాల్గొన్నారు.

## బడే నాగజ్యోతిని భారీ మెజార్టీతో గెలిపిద్దాం



కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి

గోవిందరావుపేట, అక్టోబర్ 27 : బీఆర్‌ఎస్ ము లుగు నియోజకవర్గ అభ్య ర్థి బడే నాగజ్యోతిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కంక ణం కట్టుకోవాలని ఎంపీపీ సూడి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని మచ్చాపూర్ గ్రామంలో మండల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు వంగరి ప్రభాకర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీపీ హాజరై మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి ఓట్లు అడిగే హక్కు బీఆర్‌ఎస్‌కే ఉందన్నారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టోను వివరిస్తూ ఇంటింటా ముమ్మర ప్రచారం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కాగంటి సాగర్ బీఆర్‌ఎస్‌లో చేరగా ఆయనకు గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. మండలాధ్యక్షుడు సాయి కుమార్, రైతు బంధు సమితి మండల కన్వీనర్ మధుసూధన్‌రెడ్డి, సమన్వయ కమిటీ సభ్యుడు సురేందర్, నాయకులు తలసీప్రసాద్, నర్సింహనాయక్, దేవానాయక్, హేమాద్రి, సర్పంచ్‌లు రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## బీఆర్‌ఎస్ నాయకుల ఇంటింటా ప్రచారం..

ములుగురూరల్, అక్టోబర్ 27 : ములుగు జిల్లా కేంద్రంలోని పలు కాలనీలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నాగజ్యోతికి ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ఇంటింటా వెళ్లి ఓటర్లను కలిసి సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన ఎన్నికల మ్యానిఫెస్టో పోస్టర్లను అందజేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన నాగజ్యోతిని సీఎం కేసీఆర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎన్నికల బరిలో ఉంచారని తెలిపారు. కారు గుర్తుకు ఓటు వేసి ప్రజలు నాగజ్యోతిని ఆశీర్వదించాలని కోరారు. ఈ ఎన్నికల ప్రచారంలో ఎంపీటీసీ గొర్రె సమ్మయ్య, బీఆర్‌ఎస్ పట్టణ చెన్న విజయ్, నాయకులు ఓదే లు, కాకి పోరుషోత్తం, రఘుపతి, రఘు, నగేశ్, వలీ, అరుణ్, శరత్ పాల్గొన్నారు.

## అనాథ వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

కృష్ణకాలనీ, అక్టోబర్ 27: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రానికి చెందిన తిప్పరవేని రజితా–రాజేందర్ దంపతుల కుమారుడు క్రీ.శే అఖిల్ పుట్టిన రోజు పురస్కరించుకుని శుక్రవారం జిల్లా కేంద్రంలోని అమృత వర్షిణీ స్వచ్ఛతా సేవా సంస్థ అనాథ వృద్ధాశ్రమంలోని అనాథ వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అనాథ వృద్ధాశ్రమ నిర్వాహకులు కుసుమ శైలజ, శ్యాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛందంగా రక్తదానం చేయాలి

కృష్ణకాలనీ, అక్టోబర్ 27: పోలీసుల అమర దినోత్సవం సందర్భంగా నేడు (శనివారం) జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్‌లో ఉదయం 9 గంటల నుంచి నిర్వహిస్తున్న రక్తదాన శిబిరానికి గణపురం మండలంలోని రక్తదాతలు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని గణపురం ఎస్సై మచ్చ సాంబమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మండలంలో ఆయా గ్రామాల నుంచి రక్తదానం చేయాలనుకునే వారు స్థానిక గణపురం పోలీస్‌స్టేషన్‌లో నేరుగా తన చరవాని ద్వారా 87126 58122 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## మల్లూరు ఆలయంలో అడిషనల్ కలెక్టర్ పూజలు

మంగపేట, అక్టోబర్ 27 : మండలంలోని మల్లూరు శ్రీహేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శుక్రవారం ములుగు అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) వేణుగోపాల్ ప్రత్యేక పూజలు చేశారు. లక్ష్మీ నర్సింహస్వామి దర్శనానికి వచ్చిన ఆయనకు అర్చకులు రాజశేఖర్‌శర్మ, రాఘవాచార్యులు, ఈశ్వర్‌చందుశర్మ బృందం సాంప్రదాయ స్వాగతం పలికారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ పేర అర్చన చేసి, ఆశీర్వచనంతో పాటు, స్వామి వారి శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలను అందజేశారు. తహసీల్దార్ వీరస్వామి, ఎంపీడీవో శ్రీధర్, ఆర్ఐ కుమారస్వామి పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

- ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు
- డీఎస్పీ రవీందర్



గోవిందరావుపేట : పస్రాలో ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్న డీఎస్పీ రవీందర్, స్థానిక సీఐ శంకర్

గోవిందరావుపేట, అక్టోబర్ 27 : అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా శాంతియుత వాతావరణంలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ములుగు డీఎస్పీ రవీందర్ సూచించారు. మండలంలోని పస్రా గ్రామంలో శుక్రవారం సీఐ శంకర్ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో పాటు సివిల్ పోలీసులతో ఫ్లాగ్ మార్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు వజ్రాయుదం లాంటిదని, ఆ ఓటును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ఎన్నికల నియమావళిని అందరు పాటించాలని, చట్టాన్ని ఉల్లంఘిస్తే చట్ట పరంగా చర్యలు తప్పవని, ఎన్నికల ప్రశాంతతకు పోలీసులు పకడ్బందీ చర్యలు చేపడుతుందని, అందుకు ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించి ఎన్నికల నియమావళిని ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పస్రా, తాడ్వాయి ఎస్సైలు షేక్ మస్తాన్, ఓంకార్‌యాదవ్, సివిల్, సీఆర్పీఎఫ్ బలగాలు పాల్గొన్నారు.

# సమయపాలన పాటించని అధికారులు

- ఎన్నికల కోడ్‌ను అడ్డం పెట్టుకొని విధులకు డుమ్మా
- అటెండెన్స్ యాప్ లేకపోవడంతో మారని తీరు



అధికారి విధులకు హాజరు కాకపోవడంతో ఖాళీగా ఉన్న పీఆర్ అకౌంట్ ఆఫీసర్ కుర్చీ

ములుగు, అక్టోబర్27 (నమస్తేతెలంగాణ): ప్రభుత్వ ఉద్యోగులుగా విధులు నిర్వర్తిస్తున్న అధికారులు సమయపాలన పాటించకుండా.. ఎన్నికల కోడ్‌ను అడ్డంపెట్టుకుని తమ కార్యాలయాలకు గైర్హాజరువుతున్నారు. మధ్యాహ్నం అయినా కార్యాలయాలకు రాకపోవడంతో వివిధ పనుల కోసం వచ్చే ప్రజ లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారుల తీరు కు మారేలా గతంలో ములుగు–వెలుగు అటెండెన్స్ యాప్ ఉండగా సమయానికి కార్యాలయాలకు చేరుకునే వారు.. ప్రస్తుతం ఆ యాప్‌ను కలెక్టర్ ఎత్తివేయడంతో అధికారులు ఆడిందే ఆట పాడిందే పాటగా మారుతుంది. శుక్రవారం ములుగు జిల్లా కేంద్రంలోని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ కార్యాలయంతో పాటు అదే సముదాయంలో ఉన్న పలు ప్రభుత్వ కార్యాలయాలను 'నమస్తేతెలంగాణ' సందర్శించగా, జిల్లా స్థాయి అధికారులతో పాటు కింది స్థాయి అధికారులు మధ్యాహ్నం 12 దాటిన విధులకు హాజరు కాలేదు. పీఆర్ కార్యాలయంలో డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఎన్‌వీవీ శ్రీనివాస్‌రావు విధులకు హాజరు కాలేదు. కార్యాలయంలో ఉన్న అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించగా ఈ నెల 3వ తేదీ నుంచి ఇప్పటి వరకు హాజరు అయినట్లు సంతకం చేయలేదు. ఈ విషయమై పంచాయతీ రాజ్ శాఖ ఉన్నతాధికారులను వివరణ కోరగా.. సదరు డివిజనల్ అకౌంట్ ఆఫీసర్ తనకు ఇష్టం వచ్చినప్పుడు విధులకు హాజరవుతున్నాడని ఆరోపించారు. కొన్ని రోజుల క్రితం విధులకు గైర్హాజరువుతున్నారని ఉన్నతాధికారులు మందలించినా తీరు మారలేదని వివరించారు. సదరు అధికారి వ్యవహారంపై చర్యలు చేపడుతామని అధికారులు పేర్కొన్నారు. అదేవిధంగా జిల్లా ముఖ్య ప్రణాళిక కార్యాలయం, భూ గర్భజలాల కార్యాలయం, ఉద్యానవన శాఖ కార్యాలయం, డీఈవో కార్యాలయం, డీఎంహెచ్‌వో కార్యాలయం, డీసీవో కార్యాలయం, పశు సంవర్ధక శాఖ కార్యాలయాల్లో కూడా అధికారులు విధులకు హాజరు కాలేదు.. ప్రతి అధికారి టేబుల్ పైన పెండింగ్ ఎంబి రికార్డులు కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా కలెక్టర్‌తో పాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు స్పందించి విధులకు డుమ్మా కొడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## పోలింగ్ కేంద్రాల పరిశీలన..

తాడ్వాయి, అక్టోబర్27 : మండలంలోని మారుమూల గ్రామాలైన కొడిశాల, బందాల, లింగాల, పోచాపురం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం జిల్లా ఎస్పీ గాస్ ఆలం సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్నికల సిబ్బందికి గల సౌకర్యాలను పరిశీలించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భూత్‌ల వద్ద ఎదురయ్యే పలు రకాల సమస్యలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నా రు. గొత్తికోయగుడెంలోని పోలింగ్ భూత్‌ను కూడా పరిశీలించారు. ఎన్నికలు సజావుగా సాగే లా ఎన్నికల సిబ్బందికి ఇబ్బందులు రాకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూ చించారు. ఆయన వెంట పస్రా సీఐ శంకర్, తాడ్వాయి ఎస్ఐ ఓంకార్‌యాదవ్ ఉన్నారు.

## ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు ..

ఏటూరునాగారం, అక్టోబర్ 27 : మండలంలో శుక్రవారం ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు ముమ్మరంగా చేపట్టారు. ఎన్నికల నేపథ్యంలో ఏటూరునాగారం, కన్నాయిగూడెం, మంగపేట మండలాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టేందుకు బృందాలను ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా శుక్రవారం మండలంలోని పలు చోట్ల ఈ బృందం వాహనాల తనిఖీలు చేపట్టారు. మద్యం, డబ్బు రవాణాపై ఆరా తీశారు.

# బీఆర్‌ఎస్‌లో చేరిన యువతకు బెదిరింపులు

- కాంగ్రెస్ పార్టీలో ఉండాలంటూ హుకుం
- యువకులకు స్థానిక నాయకుల బెదిరింపులు

తాడ్వాయి, అక్టోబర్ 27: బీఆర్‌ఎస్ సంక్షేమ పథకాలకు ఆకర్శితులవడంతో పాటు లబ్ధి పొందిన వారు బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని నమ్మి పార్టీలో చేరిన పలువరు యువకులకు, ప్రజలకు స్థానిక కాంగ్రెస్ నేతలు బెదిరింపులకు పాల్పడుతున్నారు. మాతో ఉంటారా? ఉండరా? లేకుంటే ఊళ్లో లేకుండా చేస్తామని యువకులతో పాటు వారి తల్లిదండ్రులను బెదిరిస్తున్నారు. బీఆర్‌ఎస్‌లో చేరిన ప్రతి ఒక్కరిని ఏదో రకంగా ఇబ్బంది పెట్టడమే పనిగా పెట్టుకున్న వారు పలువురు చేసుకునే వ్యాపారాల, వారు చేసుకునే పనుల్లో నూతనంగా ఇళ్లు నిర్మించుకునే వారిని అధికారులతో ఆటంకాలు కలిగిస్తూ తమ గూటికి చేరేలా ప్రణాళికలు రచిస్తున్నారు. ఒక యువకుడిని ఓ కాంగ్రెస్ నాయకుడు ఇంటికి పిలుపించుకుని ఏంటీ బీఆర్‌ఎస్‌లో ఎందుకు చేరావు, అసలు ఏమనుకుంటున్నావు బీఆర్‌ఎస్‌కు పనిచేస్తే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించినట్లు తెలిసింది. మరో నాయకుడు ఓ యువకుడితో మీ నాన్న ఊళ్లో ఉండాలుకుంటున్నావా? లేదా? ఎందుకు బీఆర్‌ఎస్‌కు పనిచేస్తున్నారు. గెలిచేది మేమే అంటూ మాయమాటలు చెప్తూ యువతను ఒకవైపు బెదిరిస్తునే మరో వైపు సముదాయిస్తున్నారు. మండలకేంద్రంలో గతంలో కంటే బీఆర్‌ఎస్ బలంగా తయారయ్యింది. కాంగ్రెస్ పార్టీ గెలిచే పరిస్థితిలో లేకపోవడంతో దీన్ని జీర్ణించుకోలేని నాయకులు కుట్రులు చేస్తూ యువతను బెదిరింపులకు గురి చేయడంతో పాటు పోలీసులతో కేసులు పెట్టిస్తూ, అధికారులతో బెదిరింపులకు పాల్పడుతున్నారు. ప్రజలతో మమేకమై సాధించుకోవాల్సిన ఓట్లను ఇలా బెదిరింపులకు గురి చేస్తూ సాధించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే పలువురు నాయకుల తీరుతో ప్రజలు ఇబ్బందులకు గురై ఈ సారి ములగు నియోజకవర్గంలో వారి అభ్యర్థిని ఓడించి బుద్ధి చెప్పాలని చూస్తున్నారు. ప్రజలకు మంచి చేస్తూ గెలిచేలా ఉండాలి కానీ, ఇలా ఇబ్బందులు పెట్టి గెలుస్తారు అని చర్చించుకుంటున్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

గణపురం, అక్టోబర్ 27: సీజనల్ వ్యాధులపై మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ అనూష అన్నారు. గణపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని కొండాపురం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా అనూష గ్రామంలోని 48 మంది వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం అనారోగ్యంతో బాధ పడుతున్న నలుగురికి రక్త నమూనాలు సేకరించి, జిల్లా ప్రధాన ఆసుపత్రికి పంపించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మామిడి రవి, డాక్టర్ శివరాజ్, పీహెచ్‌ఎన్ శౌరిలమ్మ, హెల్త్ అసిస్టెంట్ వేణు, ఏఎన్‌ఎం స్వర్ణలత, ఆశ కార్యకర్తలు లక్ష్మి, కోమల పాల్గొన్నారు.

## మానవ అక్రమ రవాణా నియంత్రణపై అవగాహన

వెంకటాపురం(నూగూరు) అక్టోబర్ 27 : మానవ అక్రమ రవాణా నియంత్రణపై శుక్రవారం మండల కేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాయలంలో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీడబ్ల్యూవో ప్రేమలత మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా అనేది నేరమన్నారు. ప్రతి గ్రామంలో మానవ అక్రమ రవాణాపై అవగాహన కల్పించాలని సూచించారు. సీడీపీవో శిరీష, ఏసీడీపీవో ముత్తమ్మ, ప్రజ్వల సీనియర్ కో ఆర్డినేటర్ చంద్రయ్య, అంగన్‌వాడీ సూపర్ వైజర్ పుష్పవతి ఉన్నారు.